

నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, గురువారం 24 అక్టోబర్ 2024 HYDERABAD



## సైబర్‌నేరగాళ్లకు సంకెళ్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు వివిధ రాష్ట్రాల్లో గాలించి..పలువురు సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. వీరిలో బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు ఖాతాలు అందించే కమీషన్ ఏజెంట్లు, మరికొందరు నేరుగా నేరానికి పాల్పడుతున్న వారు కూడా ఉన్నారు. ప్రధానంగా రాజస్థాన్ నుంచి ఎక్కువగా నేరగాళ్లను పట్టుకున్నట్లు తెలిసింది. ఆరు బృందాలుగా విడిపోయిన సైబర్‌క్రైమ్ పోలీసులు.. ఒక్కొక్కరూ ఒక్కో రాష్ట్రానికి వెళ్లారు. ఈ బృందాలు వేర్వేరు ప్రాంతాల్లో 20 మంది సైబర్‌నేరగాళ్లను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని సైబర్‌క్రైమ్ పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.




# క్షీణించిన శాంతి భద్రతలు

### పోలీసులకు స్వేచ్ఛనివ్వాలి • సీసీ కెమెరాలు పనిచేయకపోతే బాగు చేయించాలి
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ • లింగారెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శ



లింగారెడ్డి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అంబర్‌పేట, అక్టోబర్ 23 : తెలంగాణలో శాంతి భద్రతలు క్షీణించాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం పోలీసులను స్వేచ్ఛగా పనిచేయనివ్వడంలేదని ఆరోపించారు. రాష్ట్రంలో వెంటనే హోం శాఖ మంత్రిని నియమించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్ అంబర్‌పేట సాయిబాబానగర్ కాలనీలో హత్యకు గురైన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ లింగారెడ్డి దంపతుల ఇంటికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్‌గౌడ్, కార్పొరేటర్ పద్మా వెంకటరెడ్డితో కలిసి వెళ్లారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. లింగారెడ్డి దంపతులను పట్టపగలు కిరాతకంగా హత్య చేశారన్నారు. ఈ జంట హత్య కేసులో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేవని, దారుణమైన పరిస్థితులు ఉన్నాయంటూ స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. 'జగిత్యాలలో జీవన్‌రెడ్డి అనుచరుడిని హత్య చేశారు. ఇక్కడ హైదరాబాద్‌లో వృద్ధ జంటను కిరాతకంగా హత్య చేశారు. జంట హత్యలు జరగడంతో హైదరాబాద్‌లో ప్రజలు భయం తో ఉన్నారు' అని పేర్కొన్నారు.

#### నిందితులను అరెస్టు చేయాలి

శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని నగర సీపీ, డీజీపీలను కోరుతున్నానన్నారు. 'పోలీసులకు సరైన వ్యవస్థ, స్వేచ్ఛ ఇచ్చి వాళ్ల పని వాళ్లను చేసుకోనివ్వాలి. పోలీసు అధికారులను మా పైకి.. అశోక్‌నగర్‌లో పిల్లల పైకి ఉసిగొల్పకుండా శాంతిభద్రతలు చూడనివ్వాలి. సమర్థవంతమైన పోలీసు అధికారులు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. వాళ్లకు స్వేచ్ఛ ఇవ్వాలి. వాళ్ల పని వాళ్లను చేయనివ్వాలి' అని అన్నారు. లింగారెడ్డి, ఊర్మిళదేవి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, ఆత్మస్థైర్యాన్ని అందించాలన్నారు. తాము పది లక్షల సీసీ కెమెరాలు నగరంలో ఏర్పాటు చేశామని, అవి పని చేయకపోతే ప్రభుత్వం బాగుచేయించాలని, సర్కారు పట్టించుకోకపోతే తామే వాటికి మరమ్మతులు చేయిస్తామని కేటీఆర్ చెప్పారు. జంట హత్యలకు పాల్పడిన నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేసి ప్రజల ముందుంచాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు.

# హెచ్‌సిటీకి పైసల్లేవ్!

## నిధుల కేటాయింపు లేక బల్దియా విలవిల

- బడ్జెట్‌లో గొప్పలు.. ఆచరణలో తప్పని తిప్పలు
- పది నెలల్లో ఒక్క ప్రాజెక్టునూ చేపట్టని వైనం
- మరో ఐదు నెలలు దాటితే.. ఆర్థిక సంవత్సరం ముగింపు
- నేటికీ బల్దియా ఖజానాకు చేరని నిధులు
- పనులపై తీవ్ర ప్రభావం.. కుంటుపడుతున్న అభివృద్ధి

'హైదరాబాద్ నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. బడ్జెట్‌లో రూ.10వేల కోట్లకు పైగా నిధులు ఇచ్చాం'...బడ్జెట్ కేటాయింపుల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన గొప్ప ప్రకటనలు.. కానీ ఆచరణలో మాత్రం ముఖ్యమైన ప్రాజెక్టు ఒక్కటీ పట్టాలెక్కలేదు. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధి పేరిట కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ పథకాల స్థానంలో కాంగ్రెస్ సర్కారు 'హెచ్ సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్, ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూపకల్పన చేసింది. గత ప్రభుత్వ పథకాల పేర్లను విజయవంతంగా మార్చేసిన ప్రభుత్వం.. హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై ఆ స్థాయి ఫోకస్ పెట్టలేకపోయింది. ఫలితంగా జీహెచ్ఎంసీలో అభివృద్ధి కుంటుపడింది. గడిచిన 10 నెలలకు పైగా ఒక్క కొత్త ప్రాజెక్టూ ముందడుగు పడకపోవడం గమనార్హం.

-సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ)



కాంగ్రెస్ సర్కారు హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా నాలాల అభివృద్ధి రెండో దశ పనులకు రూ. 458 కోట్లతో 29 చోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించి టెండర్లు పిలవగా..ఇందులో కేవలం తొమ్మిది ప్రాంతాల్లో పనులు మొదలు కావడం, ఇవి కాస్తా ఒక్కొక్కటీ రూ. 5 కోట్ల లోపు మాత్రమే. అలాగే ఎస్ఆర్‌డీపీ స్థానంలో హెచ్ సిటీ కింద కేబీఆర్ పార్కు చుట్టూ రూ. 826 కోట్లతో ఆరు కూడళ్లలో రెండు దశల్లో పనులు చేపట్టాలని నిర్ణయించి, ఈ ప్రతిపాదనలను పరిపాలన అనుమతులతోనే సరిపెట్టారు. వీటికి నిధులు మంజూరుపై స్పష్టత ఇవ్వలేదు. ఆర్థిక సంవత్సరంలో రెండు టర్మ్‌లు ముగిసినా.. ప్రభుత్వం నుంచి జీహెచ్ఎంసీకి చిల్లి గవ్వ ఇవ్వలేదు.

#### నాటికి.. నేటికి ఎంతో తేడా..

కేసీఆర్ ప్రభుత్వం హైదరాబాద్ రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువచ్చి వాయు వేగంతో 37 ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులను చేపట్టి చాలా ప్రాంతాల్లో సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేసింది. ఏటా రూ. 600-700 కోట్ల మేర నిధులను ఖర్చు చేసి ఫ్లై ఓవర్లు, ఆర్వోబీ, ఆర్‌యూబీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పాటు వరద నీటికి శాశ్వత పరిష్కారంగా ఎస్ఎన్‌డీపీ పథకాన్ని తీసుకువచ్చి రూ.985.45కోట్లతో చేపట్టిన మొదటి విడత పనులు రూ.592.68కోట్లు ఖర్చు పెట్టి 39 చోట్ల పనులను పూర్తి చేసింది. గుంతలు లేని రహదారులే లక్ష్యంగా సీఆర్ఎంపీ పథకాన్ని రూ. 900కోట్లతో చేపట్టి ఆదర్శవంతమైన పథకంగా మార్చింది. అయితే ఈ మూడు కీలక ప్రాజెక్టులకు గత సర్కారు రెండో దశ ప్రతిపాదనలతో సిద్ధమైంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఈ పథకాల స్థానంలో హెచ్ సిటీ ప్రాజెక్టుగా ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్న రవాణా వ్యవస్థ, మౌలిక వసతుల కల్పనకు హెచ్ సిటీ కింద కేవలం రూ. రూ.2675.35 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులను ఇప్పటి వరకు మంజూరు చేయకపోవడంతో ఆ ప్రభావం పనులపై పడుతున్నది.

#### రూ.1400కోట్లకు పైగా..

ఇప్పటికే రూ. 1400కోట్లకు పైగా జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో బకాయిపడింది. వీటిని చెల్లిస్తేనే పనులు జరుపుతామని కాంట్రాక్టర్లు ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ కొత్త పనులపై కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో అధికారులు తరచూ టెండర్లను ఆహ్వానిస్తూ వస్తున్నారు. మొత్తంగా ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణాలు కొత్తవి ప్రారంభం కాకపోవడం, పురోగతి ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం, నాలా పనులపై నిర్లక్ష్యం వహిస్తున్న కారణంగా అటు ట్రాఫిక్, ఇటు వరద ముంపు సమస్యలు తప్పడం లేదు. నామమాత్రంగా జంక్షన్ల అభివృద్ధి, సీసీ రోడ్ల పనులు తప్ప.. కీలకమైన ప్రాజెక్టులు ఒక్కటీ ముందడుగు పడటం లేదు.

## ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయండి: కమిషనర్

ఆరాంఘర్-జూపార్క్ ఫ్లై ఓవర్ పనులకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌తో కలిసి గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు నిర్మాణంలో ఉన్న శిల్పా లే అవుట్ ఫేస్ -2 ఫ్లై ఓవర్, ఆరాంఘర్ నుంచి జూ పార్క్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్ పనులను పరిశీలించారు. శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల్లో జాప్యం జరుగుతున్నదని ఇంజినీరింగ్ అధికారులు వివరించగా, వెంటనే విద్యుత్ లైన్ తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. 33 కేవీ విద్యుత్ లైన్ తొలగించకపోవడంతో శిల్పా లే అవుట్ ఫేస్-2 పనులు స్టామ్ వాటర్ డ్రైన్/కల్వర్టులు, ర్యాంపు (ఆర్ఈ) పనులు చేపట్టలేకపోయామని అధికారులు కమిషనర్‌కు వివరించారు. దీంతో ఆయన విద్యుత్ లైన్‌ను వెంటనే తొలగించాలని, టీజీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. కమిషనర్ వెంట ప్రాజెక్టు సీఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు ఉపేందర్ రెడ్డి, వెంకన్న, డిప్యూటీ ఈఈ హరీశ్ తదితరులు ఉన్నారు.





#### ఈ జాగ్రత్తలు పాటించండి!

- ఫోన్‌ను అమ్మేముందు డేటాను బ్యాక్అప్ చేయండి.
- సెల్‌ఫోన్‌లోని డేటాను ఫ్యాక్టరీ రీసెట్ ఆప్షన్ ద్వారా పూర్తిగా తొలగించాలి. అలా చేయడం వల్ల ఇతరులు మీ వ్యక్తిగత సమాచారాన్ని వినియోగించి బ్లాక్‌మెయిల్ చేసేందుకు అవకాశం ఉండదు.
- అన్ని అకౌంట్ల నుంచి మీ ఫోన్‌ను డీరిజిస్టర్ చేయాలి.
- గూగుల్ అకౌంట్‌ను సైన్ అవుట్ చేయాలి. సెట్టింగ్స్‌లో యూజర్స్ అండ్ అకౌంట్స్ ఆప్షన్‌లోకి వెళ్లి రిమూవ్ అకౌంట్ బటన్‌ను క్లిక్ చేయాలి.
- ఇంత చేసినా కూడా పాత సెల్‌ఫోన్‌ను అపరిచితులకు విక్రయించొద్దు. కొనుగోలుదారు నేరుగా మిమ్మల్ని సంప్రదించాకే విక్రయించాలి.
- అవసరమైతే వారి అడ్రస్ ప్రూఫ్, ఫొటో, సెల్‌ఫోన్‌ను వారికి విక్రయించినట్టుగా సంతకం తీసుకోవాలి.

# పాత ఫోన్లు అమ్మితే.. కొత్త చిక్కులు తప్పవు

**సైబర్ నేరాలకు అస్త్రాలు**


సాధారణంగా సెల్‌ఫోన్లలో కాపర్, లిథియం తదితర లోహాలతోపాటు మదర్ బోర్డు, ఐసీ, స్క్రీన్ లాంటి ఉపకరణాలు ఉంటాయి. అవి వినియోగించగలిగే స్థితిలో ఉంటే నేరగాళ్ల ముఠాలు వాటిని వేరు చేసి తిరిగి విక్రయిస్తారు. పాత ఫోన్లలో డేటాను ఫార్మాట్ చేయకపోతే పర్సనల్ చిత్రాలు, వీడియోలు ఉంటే అవి సైబర్ నేరస్తుల ముఠాలకు అమ్ముతున్నారు. వీటితోపాటు ఆ ఫోన్లను వీలైతే మరమ్మతు చేసి, సైబర్ నేరాలకు పాల్పడుతుంటారు. ఒకవేళ పోలీసులు దానిపై విచారిస్తే ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఆధారంగా అమ్మినవాళ్లే నేరస్తులుగా పరిగణించబడతారని హెచ్చరిస్తున్నారు. అందుకే సైబర్ కేటుగాళ్లు తెలివిగా ఇతరుల పేర్లపై ఉన్న సెల్ ఫోన్లను, సిమ్ కార్డులను వినియోగించి నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు.

- వాటి ద్వారానే బాధితులకు డబ్బుల ఎర
- రాజస్థాన్ సైబర్ లింక్‌లో పాత ఫోన్లే కీలకం
- పాతఫోన్లను ఇతరులకు అమ్మొద్దంటున్న సీఎస్‌బీ

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): పాత సెల్‌ఫోన్‌ను తెలియని వారికి విక్రయిస్తే చిక్కుల్లో పడే అవకాశాలున్నాయని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు హెచ్చరిస్తున్నారు. పాత మొబైల్ ఫోన్లను కొని వాటితో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు వరసగా వెలుగు చూస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. గత ఆగస్టులో బిహార్‌కు చెందిన ఓ ముఠాను రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి ఏకంగా 4,000కు పైగా సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముఠాను విచారించడంతో ఎన్నో కీలక విషయాలు వెలుగుచూశాయి. ఇటీవల తెలంగాణ పోలీసులు అరెస్టు చేసిన రాజస్థాన్ ముఠాకు, ఈ పాతఫోన్లు కొని, వారికి విక్రయించే ముఠాలకు సంబంధం ఉన్నట్టు తేలింది. ఈ పాత సెల్ ఫోన్లు కొనుగోలు చేస్తున్న ముఠాలు కిలోల లెక్కన మొబైల్ ఫోన్లను కొనుగోలు చేసి.. అందులోని సమాచారాన్ని రిట్రీవ్ చేసి, అందులోని కాంటాక్ట్ నంబర్ల చొప్పున సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. గతంలో పట్టుబడిన ఈ ముఠా బిహార్‌లోని కతిహార్ జిల్లా రౌతారా ప్రాంతానికి చెందిన అక్తర్ అలీ సూచనతో పాత సెల్‌ఫోన్లు కొంటారు. తమ నుంచి కిలోల లెక్కన అక్తర్ వాటిని కొనుగోలు చేసి, కీలక సమాచారం సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

## కారు అద్దాలు పగులగొట్టి.. రూ.2 లక్షలు దోపిడీ

హయత్‌నగర్, అక్టోబర్ 23: గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలను పగులగొట్టి రూ. 2 లక్షలు నగదు ఎత్తుకెళ్లిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీనగర్, చింతలకుంట, సరస్వతీనగర్‌కు చెందిన వాకిటి సుధాకర్‌రెడ్డి(33) హయత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాటు రిజిస్ట్రేషన్ కోసం స్నేహితుడి కారులో వచ్చాడు. డాక్యుమెంట్ తయారీ కోసం సుధాకర్‌రెడ్డి వెళ్లి వచ్చేసరికి.. కారులో ఉన్న రూ.2 లక్షలు కనిపించలేదు. ఆగంతకులు కారు వెనుక అద్దాలు పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు గుర్తించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.






## చిరు వ్యాపారులపై ప్రతాపం

### ఆక్రమణల పేరిట డబ్బాలు తొలగించిన పోలీసులు

బేగంపేట, అక్టోబర్ 23: చిరు వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు మరోసారి ప్రతాపం చూపారు. బుధవారం సికింద్రాబాద్, రాణిగంజ్, బేగంపేట ఏరియాల్లో భారీ బందోబస్తు నడుమ ట్రాఫిక్ పోలీసులు, బేగంపేట సర్కిల్ జీహెచ్ఎంసీ సిబ్బంది సంయుక్తంగా ఫుట్‌పాత్‌లపై ఉన్న చిరు వ్యాపారాలను తొలగించారు. వ్యాపార వాణిజ్య కేంద్రమైన రాణిగంజ్‌లో రెండు రోజులుగా ట్రాఫిక్ ఏసీపీ శంకర్రాజు ఆధ్వర్యంలో రాణిగంజ్, మినిస్టర్ రోడ్డు, బేగంపేట ప్రకాశ్‌నగర్, ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఆక్రమించిన ఫుట్‌పాత్ వ్యాపారాలను పూర్తిగా తొలిగించారు. ట్రాఫిక్ పోలీసులకు మామూళ్లు అవసరమైన ప్రతిసారి ఇలా స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టడం పరిపాటిగా మారిందని దుకాణదారులు ఈ సందర్భంగా మండిపడ్డారు.

# సెల్‌ఫోన్ల రికవరీలో పోలీసుల దూకుడు

### రూ. 2.40 కోట్ల విలువైన 800 ఫోన్లు బాధితులకు అందజేత

సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): సెల్‌ఫోన్ల రికవరీలో సైబరాబాద్ పోలీసులు దూకుడు పెంచారు. చోరీకి గురైన, మిస్సైన చరవాణిలను రికవరీ చేయడంలో క్రైమ్ విభాగం రికార్డు సృష్టిస్తున్నది. ఇందులో భాగంగానే గడిచిన 35 రోజుల్లో రూ.2.40కోట్ల విలువ చేసే 800 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ మేరకు బుధవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.నర్సింహ వివరాలను వెల్లడించారు. సీసీఎస్, ఐటీసెల్, స్థానిక పోలీసులతో కలిసి 35 రోజుల్లో మాదాపూర్ సీసీఎస్ బృందం 135, బాలానగర్ సీసీఎస్ బృందం 140, మేడ్చల్ సీసీఎస్ బృందం 101, రాజేంద్రనగర్ సీసీఎస్ బృందం 133, శంషాబాద్ సీసీఎస్ బృందం 72, మేడ్చల్ జోన్ పోలీసులు 105, ఐటీ సెల్ బృందం 101 చొప్పున మొత్తం రూ. 2.40కోట్ల విలువైన 800 సెల్‌ఫోన్లను రికవరీ చేసి, బాధితులకు అందించామన్నారు. రికవరీ చేసిన ఫోన్లలో 60 శాతం వరకు ఇతర రాష్ట్రాల నుంచే ఉన్నట్లు చెప్పారు. ఫోన్ పోయిన వెంటనే బాధితులు స్థానిక పోలీసు స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్‌లో బాధితులు నేరుగా కూడా రిపోర్ట్ చేయవచ్చని, దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ పోర్టల్ ద్వారానే చోరీకి గురైన లేదా మిస్సైన సెల్‌ఫోన్లను ఎక్కడ, ఎవరి వద్ద ఉన్నాయో గుర్తించి.. రికవరీ చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, సైబరాబాద్ పోలీసుల సేవలు భేష్ అని సెల్‌ఫోన్ బాధితులు ఈ సందర్భంగా పోలీసులను పొగడ్తలతో ముంచెత్తారు.

#### ఇలా ఫిర్యాదు చేయండి

సైబర్ నేరాలు లేదా ఆన్‌లైన్ ద్వారా ఆర్థిక నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930కి కాల్ చేయడం లేదా **cybercrime.gov.in**వెబ్‌సైట్‌లో రిపోర్ట్ చేయాలని డీసీపీ నర్సింహ సూచించారు. ఇక సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో రిపోర్ట్ చేయాలని డీసీపీ నర్సింహ సూచించారు.



పోలీసులు రికవరీ చేసిన ఫోన్లు